

దళితుని మృతిపై కొనసాగుతున్న విచారణ

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్, గంగాధర నెల్లూరు : చిత్తూరు జిల్లా జీడీ నెల్లూరు మండలం పాచిగుంట దళితవాడకు చెందిన సుధాకర్ అనుమా నాస్పద మృతిపై విచారణ కొనసాగుతున్నట్లు వన్‌టౌన్ సిఐ విశ్వనాథ రెడ్డి తెలిపారు. ఈ కేసులో నాగరాజు, రఘులను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నామని, సుధాకర్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. పోస్టుమార్టం రిపోర్టు అందిన తర్వాత అతిగా మద్యం సేవించి మతి చెందాడా? హత్య అనే విషయం తెలిసే అవకాశం ఉందని, ప్రస్తుతం అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. నాగరాజు, రఘులను రిమాండ్‌కు తరలించారు.

స్వగ్రామంలో సుధాకర్ అంత్యక్రియలు

మండలంలోని పాచిగుంట దళితవాడకు చెందిన సుధాకర్ మృతి అనుమానాస్పదం కావడంతో శనివారం చిత్తూరు వన్‌టౌన్ పోలీసుస్టేషన్ ఎదుట కుటుంబ సభ్యులు, బంధువులు ధర్నా చేశారు. స్టేషన్‌లో కేసు నమోదు చేసిన అనంతరం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన వైద్యులు మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. అక్కడి నుంచి వారు పాచిగుంటకు సుధాకర్ మృతదేహాన్ని తరలించి ఆదివారం ఉదయం స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. మృతునికి భార్య, ముగ్గురు కొడుకులు ఉన్నారు.

తామర్ల హరివిల్లు



వేసవి తాపానికి కూల్‌కూల్‌గా..!



ప్రజాశక్తి-సోమల: దాహం తీర్చుకోవడానికి నీరు దొరక్క ఓ కోతి బీర్ బాటిల్‌ను కోతి చేత పుచ్చుకుంది. సోమల దిగువకుంటలో పుష్పాలు విరబూసినట్టు కొంగలు చెట్లపై వాలిన దృశ్యం ఆవులపల్లి వద్ద చెరువులో తామర పువ్వుల అందాలు పలువురిని ఆకర్షించాయి. సోమల మండలంలో ఈ అద్భుత దృశ్యాలు 'ప్రజాశక్తి' కెమెరాకు ఆదివారం చిక్కాయి.

కొంగల కనువిందు





టీబీపై అవగాహన కలిగి ఉండాలి

ర్యాలీ ప్రారంభోత్సవంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభావతి దేవి

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: టీబీపై అవగాహన కలిగి వుండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభావతి దేవి అన్నారు. ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం ర్యాలీని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ప్రభావతి దేవి ఆదివారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్యాధికారి మాట్లాడుతూ క్షయ నిర్మూలనలో భాగంగా ఈ సంవత్సరం 'అవును క్షయ (టిబి)ని అంతం చేయవచ్చును' అనే నినాదంతో ప్రజల ముందుకు వెళుతున్నామన్నారు. టీబీ 'మైకో బ్యాక్టీరియం ట్యూబర్క్యులే అనే బ్యాక్టీరియా' ద్వారా వ్యాపిస్తుందని , జబ్బు ఉన్న వ్యక్తి తుమ్మినప్పుడు తుంపర్లు ఆరోగ్యవంతులు పీల్చినప్పుడు వ్యాప్తి చెందుతుందన్నారు. శరీరంలో వెంట్రుకలు, గోర్లు తప్ప ఏ భాగానికైనా టీబీ రావచ్చునని తెలిపారు. రెండు వారాల మించి దగ్గు , ఛాతీలో నొప్పి, సాయంకాలం పూట జ్వరం రావడం, బరువు తగ్గిపోవడం, ఆకలి పూర్తిగా లేకుండా వుండటం వంటివి ఈ వ్యాధి లక్షణాలు అని తెలిపారు. గల్ల పరీక్ష ద్వారా మైక్రోస్కోపిక్ , సిబి నాట్ , ఎక్స్ రే ద్వారా వ్యాధి నిర్ధారణ చేస్తారని, ఇది అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగా ఇస్తారన్నారు. పాజిటివ్ వచ్చిన వ్యక్తులకు ఆరు నెలల పాటు ఉచిత మందులు ఇస్తారని తెలిపారు. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉన్నవారికి , పోషకాహార లోపం ఉన్నవారికి, దీర్ఘకాలిక వ్యాది .గ్రస్తులకు, వృద్ధులకు, పొగ తాగే వారికి ,సామాజిక బలహీనత ఉన్న వారికి క్షయ ఎక్కువగా వచ్చే అవకాశం ఉందన్నారు. టీబీ ఉన్న వ్యక్తి సంవత్సర కాలంలో 15 – 20 మందికి వ్యాపింప చేసే అవకాశం వుందన్నారు. టిబి రోగి దగ్గినప్పుడు రుమాలు నోటికి అడ్డు పెట్టుకోవాలని, టీబీ రాకుండా ఉండేందుకు పోషకాహారం తినాలని పుట్టిన ప్రతి బిడ్డకు తప్పక బీసీజీ టీకా వేయించాలని రోగి ఎక్కడపడితే అక్కడ ఉమ్మి వేయకూడదని తెలిపారు. మందులు క్రమం తప్పక డాక్టర్ సూచన మేరకు పూర్తి కాలం మందులు 6 నెలలు వాడితే జబ్బు నయమవుతుందని తెలిపారు. ప్రభుత్వ వైద్యశాలలలో మందులు ఉచితంగా లభిస్తాయని, క్షయ వ్యాధిగ్రస్తులకు మందులు వాడుతున్న రోజుల్లో 500 రూపాయలు డిబిటి ద్వారా వారి బ్యాంకు అకౌంట్ కి పౌష్టికాహార నిమిత్తం ఇస్తారని తెలిపారు. మందులు వాడకుంటే ప్రాణాపాయం ఎదురయ్యే ప్రమాదం వుందన్నారు. టిబి అంతం ప్రతి ఒక్కరి బాధ్యత, టిబి లేని సమాజ స్థాపన ధ్యేయం అని తెలిపారు . త్వరలో పెద్దలకు, నిర్ణయించిన వారికి కూడా టిబి రాకుండా బిసిజీ టీకాల కార్యక్రమం రానుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీబి నివారణ అధికారి డాక్టర్ వెంకట ప్రసాద్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అరుణ్ కుమార్, డాక్టర్ రవి రాజు, డాక్టర్ శిరీష, డాక్టర్ సాయి షర్మిల, గుణశేఖర్ ,జార్జ్ అధికారులు, నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

రైతుల ఆశలు ఆవిరి.. అప్పుల అగాథంలో ఆక్రందన

- కానరాని పూత
- నిలువునా ముంచిన మామిడి
- ఎంత ప్రయత్నించినా ఫలితం శూన్యం

ప్రజాశక్తి - వెదురుకుప్పం: ప్రస్తుత వాతావరణ ప్రతికూల పరిస్థితుల కారణంగా మామిడి పంట పూత పూర్తిగా కనుమరుగైంది. దీంతో రైతులు మామిడి పంటపై పెట్టిన పెట్టుబడి ఆవిరై అప్పుల అగాథంలో కూరుకుపోయారు. రైతుల ఆశలు అడుగంటాయి. అప్పుల అగాథంలో కూరుకుపోయి ఆక్రందనలు పెడుతున్నారు. ఎలా బయటపడాలో తెలియక అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. మామిడి పంటలో నవంబరు చివరి వారం నుంచి మామిడి పంటపై క్రిమి సంహారిక మందులను రైతులు పిచికారి చేస్తారు. వివిధ చీడ పీడల నివారణకు ఈ మందులను మామిడి కాయల మండి వ్యాపారుల వద్ద, మందుల దుకాణాల నుంచి రైతులు కొనుగోలు చేస్తారు. మరి కొంత మంది రైతులు మామిడి కాయల మండి వ్యాపారుల నుంచి క్రిమి సంహారిక మందులు అప్పు తెచ్చుకుంటారు. పంట దిగుబడి వస్తే ఆ మండి యజమానికి మామిడి కాయలు పంపి అప్పు జమ చేసి మిగిలిన సొమ్మును తీసుకుంటారు. మరి కొంత మంది రైతులు ధనవంతుల వద్ద అప్పు తెచ్చుకుని షాపులలో క్రిమి సంహారక మందులు తెచ్చుకుని పిచికారీ చేస్తారు. దీంతో పంట దిగుబడి పెరిగి ఆశాజనకంగా వుండేది. ఈ ఏడాది పరిస్థితి అందుకు భిన్నంగా మారింది. మామిడి చెట్లలో పూత పూర్తిగా కనిపించకపోవడంతో రైతులు దిక్కుతోచక అయోమయంలో పడ్డారు.



ప్రస్తుతం మండలంలో 2,300 ఎకరాలు పంట సాగుచేస్తున్నారు. గత సంవత్సరంతో పోలిస్తే ఈసారి పంట దిగుబడి 75 శాతం తగ్గిందని రైతులు వాపోతున్నారు. ఎటు చూసినా మామిడి పంటలో పూత కాన రాలేదు. మామిడి చెట్లకు మొత్తం విగురులు వచ్చాయి. దీంతో రైతులు క్రిమిసంహారక మందులకే చేసిన అప్పులే మిగిలాయి. ఎంత యత్నించినా మామిడి దిగుబడి ఆశాజనకంగా రావడంలేదు.

ఈసారి మామిడి పంట లేదు

ఈ సంవత్సరం మామిడి పంట పూర్తిగా రైతులను దెబ్బ తీసింది. గత సంవత్సరమైనా కొద్దోగొప్పో పండేది. ఈ సారి మామిడి పంట పూర్తిగా లేదు. మామిడి చెట్లలో బంక రోగం అధికంగా ఉంది . చెట్లపై నుండి జిగట కారుతోంది. ఏమి చేయాలో అర్థం కాలేదు.



- గుణశేఖర్ నాయుడు , పిల్లిగుండ్లపల్లి మామిడి రైతు, ఎస్‌ఆర్‌పురం మండలం.

వాతావరణంలో మార్పులు ఉంటే పూతల్లో మార్పులు ఉంటాయి..

మామిడి పూత చాలావరకు వాతావరణ పరిస్థితుల పైన, రైతులు చేపట్టే ఎరువులు, యాజమాన్యం చర్యలు పైన ఆధారపడి ఉంటుంది. సాధారణంగా జూలై, ఆగస్టు నెలలో మామిడి చెట్లకు వచ్చిన ఇగురులు ముదిరి రెమ్మల్లో పూత డిసెంబర్ చివరి వారంలో లేదా జనవరి మాసంలో వస్తుంది. మామిడి పూతలు రావడానికి ముందు రెండు నెలలు బెట్ట పరిస్థితులు అవసరం. డిసెంబర్‌లో సగటు ఉష్ణోగ్రత 18 –23 సెంటిగ్రేడ్, రాత్రిపూట 10 –13 సెంటిగ్రేడ్ వుంటేనే పూత రావడానికి అనుకూలంగా ఉంటుంది. ఈ పరిస్థితుల్లో తేడాలు వస్తే పూతా రావడంలో మార్పులు ఉంటాయి. పూతకు ముందు రెండు నెలలు తోటలకు నీటి తడులు ఇవ్వడం పూర్తిగా నిలిపివేయాలి. నవంబర్, డిసెంబర్‌లో చలి వాతావరణం మరి ఎక్కువగా ఉన్నప్పుడు పువ్వు మొగ్గలు రావడం ఆలస్యం అవుతుంది. ఈ పరిస్థితులు ఉన్నప్పుడు పూమొగ్గలను ఉత్తేజపరిచేందుకు డిసెంబర్ రెండవ పక్షంలో లీటరు నీటికి10 గ్రాములు మల్టీకే పొటాషియం నట్రైట్ ఐదు గ్రాములు, యూరియా చొప్పున కలిపి చెట్లపై రెమ్మలు భాగంలో పిచికారి చేయాలి. యూరియా మల్టీ కేలోని నత్రజని ఫొటోస్ పోషకాలు కలిపి పూ మొగ్గలను ఉత్తేజ పరిస్తే బాగా పూత రావడానికి అధికంగా అవకాశం వుంటుంది. పిండి కట్టడానికి, కాయలులో జ్ఞానం ఎదగడానికి సహకరిస్తుంది. పూతను అసలు ఎక్కువగా బూడిద రంగు తెగులు ఆశిస్తుంది. లేత ఆకులు, కాండం పూల మీద, చిరు పిందెల మీద, తెల్లని పౌడర్ లాంటి బూజు చేరుతుంది. ఇదే బూడిద తెగులు.. ఇది ఎక్కువగా రాత్రి పూట చల్లగా, పగులు వేడి ఎక్కువగా ఉన్నప్పుడు ఆశిస్తుంది. దీని వల్ల పూత, కాయ రాలిపోతుంది. దీని నివారణ కోసం మొగ్గలు కనిపించే దశలో లీటరు నీటికి మూడు గ్రాముల గంధకం కలిపి పిచికారి చేయాలి. పూత దశలో తెగులు కనిపిస్తే హై క్యాబ్కోనజోల్ రెండు మిల్లిలీటర్లు, లేదా డినోకాప్ లేదా ట్రై మాల్స్ కలిపి ఒక మిల్లీలీటరు నీటికి కలిపి పిచికారి చేయాల్సి, రైతులు సకాలంలో స్పందించి మామిడి సంరక్షణ యాజమాన్యం పాటిస్తే ఫలితాలు అధికంగా ఉంటాయి.

- లోకేష్ , ఉద్యానవన శాఖ అధికారి, గంగాధర నెల్లూరు నియోజకవర్గం.

తిరుమలలో భక్తుల రద్దీ

వరుస సెలవులతో శ్రీవారి దర్శనానికి 24 గంటలు

ప్రజాశక్తి- తిరుమల: తిరుమల తిరుపతి దేశస్థానంలో ఆదివారం భక్తుల రద్దీ కొనసాగుతోంది. తిరుమలలో టోకెన్లు లేని భక్తులకు శ్రీవారి సర్వదర్శనానికి 24 గంటల సమయం పడుతోందని టిటిడి పేర్కొంది. శ్రీవారి సర్వదర్శనానికి అన్ని కంపార్టుమెంట్లలో భక్తులతో నిండిపోయాయి. కంపార్టుమెంట్లన్నీ నిండి ఆళ్వార్ ట్యాంకు అతిధి గృహం వరకు భక్తులు వేచి ఉన్నారు. శనివారం 72,986 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 33,482 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించుకున్నారు. తిరుమలలో శనివారం రూ.2.97 కోట్లు హుండీ ఆదాయం వచ్చినట్లు టిటిడి అధికారులు తెలిపారు. వరస సెలవు దినాలు కావడంతో తిరుమల వెంకన్న ఆలయానికి భారీగా భక్తులు పోటెత్తారు.

తుంబురు తీర్థ ముక్కోటికి విస్తృత ఏర్పాట్లు

మార్చి 25న తుంబూరు తీర్థముక్కోటికి విశేష సంఖ్యలో విచ్చేసే భక్తుల సౌకర్యార్థం టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేసింది. ఆదివారం, సోమవారం ఫాల్గుణ శుద్ధ పౌర్ణమి సంధర్బంగా విశేష సంఖ్యలో భక్తులు శేషాచల అడవుల్లోని తుంబూరుతీర్థ ముక్కోటికి వస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు భక్తులను అనుమతించారు. శ్రీవారి సేవకుల ద్వారా భక్తులకు అన్నప్రసాదం, నీళ్ల, మజ్జిగ పంపిణీకి టీటీడీ ఏర్పాట్లు చేసింది. వైద్య బృందాలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అంబులెన్స్‌లు అత్యవసర సేవలు అందించేందుకు సిద్ధంగా ఉంచారు. భక్తుల భద్రత కొరకు టీటీడీ భద్రత, పోలీస్, ఆటవి సిబ్బంది సేవలందిస్తున్నారు. ఆదివారం భక్తుల సౌకర్యార్థం టీటీడీ చేసిన ఏర్పాట్లను విజిఓ నందగోపాల్, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ శ్రీదేవి, వైద్యఅధికారి డాక్టర్ కుసుమ కుమారి, అన్నప్రసాదం ప్రత్యేకాధికారి జిఎల్ఎన్.శాస్త్రి తదితరులు పర్యవేక్షించారు.

వినాయక సాగర్ కంపు.. కంపు..

- చర్యలు చేపట్టని నగరపాలక సంస్థ
- సాగర్‌ను శుభ్రం చేయండి : సిపిఎం

ప్రజాశక్తి- తిరుపతి టౌన్

వినాయకసాగర్ శుభ్రత చేపట్టడంలో నగరపాలక సంస్థ ఆరోగ్యశాఖ అధికారులు చేతులెత్తేశారు. సాగర్‌ను వారానికి ఒకసారి అయినా శుభ్రం చేయాలని, అలా శుభ్రతాచర్యలు చేపట్టకపోవడంతో వినాయక సాగర్‌కు వచ్చే స్థానిక ప్రజలు, యాత్రికులు ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. స్మార్ట్‌సిటీ పథకంలో వినాయకసాగర్ అభివృద్ధి చేయడానికి కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టారు. శుభ్రతాచర్యలు మాత్రం గాలికి వదిలి వేశారు. వినాయకసాగర్‌కు ప్రతిరోజు ఉదయం సాయంత్రం స్థానిక ప్రజలు, మహిళలు, వృద్ధులు వాకింగ్ చేసుకోవడానికి, చిన్నారులు ఆటలు ఆడుకోవడానికి వస్తూ ఉంటారు. వాకింగ్ చేసుకోవడం వచ్చేవారు సాగర్‌లో అపరిశుభ్రత చూసి ముక్కున వేలేసుకుంటున్నారు. కొత్తగా వచ్చిన కమిషనర్ అదితి సింగ్ ఇంతవరకు వినాయక సాగర్ సందర్శించకపోవడం ఆశ్చర్యకరంగా ఉంది.

అదితి సింగ్ తిరుపతి నగర మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టి నెలరోజులు పైగా అవుతున్నప్పటికీ స్థానిక 50 డివిజన్లో ఉన్న సమస్యలను పరిశీలించలేదని నగరవాసులు ఆరోపిస్తున్నారు. కేవలం రెండు, మూడు రోజులు మాత్రమే పారిశుధ్య పనులు పరిశీలించి మిగతా రోజులు ఎన్నికల నిర్వహణపై దృష్టి సారించడం వల్ల ఇక్కడ సమస్యలు పేరుకు పోతున్నాయని ఆరోపిస్తున్నారు. వినాయకసాగర్‌కి ఎంతోమంది వస్తూ..పోతూ.. ఉంటారు. ఆహ్లాదకరం ఉండే విధంగా తీర్చిదిద్దారు. కానీ కమిషనర్ ఉన్నప్పటికీ తిరుపతి పారిశుధ్యంపై ఎందుకు ఇంత నిర్లక్ష్యం వహిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. నగర సమస్యలు పట్టించుకోని కమిషనర్ తిరుపతికి ఎలా పోస్టింగ్ వేస్తారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

నిత్యం లక్షలమంది భక్తులు వచ్చే తిరుపతి వంటి యాత్రా స్థలంలో ఇంత నిర్లక్ష్యంగా కమిషనర్ వ్యవహరిస్తారా అన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. వినాయకచవతి సందర్భంగా నిమజ్జనానికి చేసిన శుభ్రత తర్వాత వాటి గురించి మర్చిపోయారు. ఆ విగ్రహాలు సగం కలిగి సంగం అలాగే ఉండిపోవడంతో పాటు నీరు కలుషితమై కంపుకొడుతున్నాయి. ఇప్పటికైనా కమిషనర్ స్పందించి నగరంలో పారిశుధ్యంతోపాటు తాగునీటి సమస్య రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఉందని స్థానికులు అంటున్నారు.

సాగర్‌ను శుభ్రం చేయండి : సిపిఎం

తిరుపతి నగరంలోని వినాయకసాగర్‌కు సందర్శకులు, వాకర్స్ పెద్దసంఖ్యలో వస్తుంటారని, ఈ ప్రాంతం వ్యర్థాలతోనూ నిండిపోయి దుర్గంధం వెదజల్లుతోందని వెంటనే శుభ్రపరచాలని సిపిఎం నేత కందారపు మురళి ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. వినాయక చవితి నిమజ్జనం తర్వాత వినాయకుడి విగ్రహాలు, శిథిలాలు కుప్పలుతెప్పలుగా ఉన్నాయని వాటిని శుభ్రపరచడంలో తీవ్రమైన నిర్లక్ష్యం కొనసాగుతున్నదని అన్నారు. మధ్యలో ఉన్న కొలనులో గుర్రపు డెక్క విపరీతంగా పెరిగిపోయి, పచ్చటి మొక్కలతో నిండిపోయిందని నీటి యాజమాన్య నిర్వహణ లేకపోవడం వల్ల తీవ్రమైన దుర్గంధం వెలువడుతోందని పేర్కొన్నారు. వాకర్స్, సందర్శకులు దుర్గంధం కారణంగా తీవ్రమైన ఇబ్బంది పడుతున్నారని తక్షణం శిధిలాలను, వ్యర్థాలను తొలగించి నీటిని శుద్ధి చేసే విధానాన్ని చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులకు సూచించారు.




తా(సా)గు నీటికీ కష్టమే..!

- నిండుకుంటున్న కండలేరు
- అట్టడుగు స్థాయికి నీటిమట్టం
- గంగ కాలువలోనూ తగ్గిన ప్రవాహం
- ఆందోళనలో రైతాంగం

ప్రజాశక్తి- శ్రీకాళహస్తి: తమిళనాడు రాష్ట్ర దాహార్తిని తీర్చడంతో పాటు నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో పలు మండలాలకు సాగునీటిని అందించడమే లక్ష్యంగా నెలకొల్పిన కండలేరు జలాశయంలో నీటినిల్వలు అట్టడుగు స్థాయికి చేరుకున్నాయి. కండలేరు పూర్తిస్థాయి సామర్థ్యం 68 టీఎంసీలు కాగా ప్రస్తుతమున్న నీటినిల్వ కేవలం 8.54 టీఎంసీలు మాత్రమే. నీటి నిల్వలు 8.4 టీఎంసీలకు పడిపోతే జలాశయం నుంచి బయటకు నీరు వదిలే అవకాశం లేదు. ప్రస్తుతం కాలువ గుండా కేవలం 705 క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేస్తున్నారు. ఆ నీరు చెన్నయ్‌కు కాకుండా కేవలం శ్రీకాళహస్తి, రేణిగుంట, తిరుపతి నగర వాసుల దాహార్తిని తీర్చడం కోసమే విడుదల చేస్తున్న పరిస్థితి. దీంతో తెలుగు గంగ కాలువ నుంచి రైతులను సాగునీటి కోసం నీటిని మళ్లించకుండా అధికారులు ఎక్కడికక్కడ అడ్డుకుంటున్నారు. ప్రస్తుతం రబీలో వేసిన వరి, వేరుశనగ పంటలు చివరి దశలో ఉండటంతో ఆఖరి తడులు వేసుకునేందుకు రైతన్న గంగ నీటిపై ఆధారపడాల్సి వస్తోంది. అయితే తెలుగుగంగ అధికారులు అడ్డుకుంటుండటంతో రైతులు ఆందోళన చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. దీంతో రైతులపై కేసులు పెట్టేందుకు కూడా అధికారులు వెనకాడటం లేదు. చేతికొచ్చిన పంట ఓ వైపు కంటిముందే ఎండిపోతుండటంతో అన్నదాతలు కేసులను సైతం లెక్క చేయకుండా గంగనీటి కోసం పోరాటం చేయాల్సిన పరిస్థితులు తిరుపతి జిల్లాలో నెలకొంటున్నాయి. ఓ వైపు..ప్రజల దాహార్తి, మరో వైపు అన్నదాత కడుపుకోత వెరసి తెలుగుగంగ అధికారులు ఏం చేయాలో దిక్కుతోచక సతమతమవ్వాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈఏడాది ఏర్పడ్డ వర్షాభావ పరిస్థితులే ఇందుకు కారణమని అధికారులు అంటున్నారు.

తా(సా)గు నీటికీ కష్టమే..!!

నెల్లూరు జిల్లా కండలేరు నుంచి తమిళనాడు రాష్ట్రం పూండి రిజర్వాయర్ వరకు 406 కిలోమీటర్ల మేర తెలుగుగంగ కాలువ ప్రవహిస్తోంది. ఈ కాలువ పరీవాహక ప్రాంతాల వెంబడి నెల్లూరు- తిరుపతి జిల్లాల వ్యాప్తంగా సుమారు



3 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. గంగనీటిపై ఆధారపడి ప్రతి ఏటా పరీవాహక ప్రాంత రైతులు రెండు కార్ల పంటలను పండిస్తున్నారు. చెన్నయ్‌కు నీటిని అందించడమే ప్రధాన లక్ష్యం అయినా కూడా లక్ష ఎకరాలకు సాగునీటిని అందించాలన్న ఒడంబడిక ఉంది. అయితే ప్రాజెక్టు ప్రారంభమైన నాటి నుంచి నేటి వరకు లక్ష ఎకరాలకు సాగునీటిని అందించింది లేదు. చెన్నయ్‌కు తాగునీటిని సరఫరా చేసే క్రమంలో అక్కడక్కడా రైతులు నీటి చౌర్యానికి పాల్పడి చెరువులకు మళ్లించడం, లేకుంటే నేరుగా మోటార్ల ద్వారా పంప్ చేసుకోవడం జరుగుతోంది. అంతే తప్ప ప్రాజెక్టు ఒడంబడికి ప్రకారం లక్ష ఎకరాలకు సాగునీరందేలా చెరువులను నింపుతున్న పరిస్థితి కనిపించడం లేదు.


తిరుపతి జిల్లాలోని శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లోని ఏడెనిమిది మండలాలకు కండలేరు రిజర్వాయర్ ద్వారా తెలుగు గంగ నీరు అందుతుంది. కండలేరు రిజర్వాయర్ లో 8.4 టియంసిలు నీరుకు తగ్గిపోతే ఈ ప్రాంతానికి సాగునీరు సరఫరా సాధ్యం కాదు. ప్రస్తుతం మార్చి 21 వతేదీ డాటా మేరకు కండలేరు రిజర్వాయర్ లో 8.53 టియంసిలు నీరు మాత్రమే ఉంది. ఇది 8.4 టియంసిలకు పడిపోతే సరఫరా ఆగిపోతుంది. ప్రస్తుతం 705 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. బహుశా కొద్ది రోజుల్లోనే మిగులు నీరు ఖాళీ కావచ్చు. తెలుగు గంగ నీళ్ల ఆశించి శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లోని కొద్ది మండలాల రైతులు పంటలు సాగు చేసే అవకాశం లేదు. కండలేరులో నిల్వ 8.4 టియంసిలకు పడిపోతే తిరుపతి, రేణిగుంట, శ్రీకాళహస్తి పట్టణ ప్రజల తాగునీటికి కూడా రిజర్వాయర్‌లో మోటార్లు పెట్టి పంపు చేసుకోవలసిందే. కండలేరు రిజర్వాయర్ నీటి సామర్థ్యం 68 టియంసిలు. ఈ ఏడు ఏర్పడిన వర్షాభావం వలన ఆశించిన మేరకు నీరు చేర లేదు. తిరుపతి జిల్లాకు చెందిన అధికారయుతమైన ఆయకట్టు దాదాపు 45 వేల ఎకరాలు. కానీ అంతకు మించి సాగు జరుగుతూ వుండగా ఈ ఏడు అసలుకే మోసం వచ్చింది. కండలేరు జలాశయాన్ని నింపుతున్న సోమలశిల రిజర్వాయర్ కూడా కేవలం 11 టియంసిలు మాత్రమే నీటి నిల్వలు ఉన్నాయి. ఈ ఏడు సాగునీరు అటుంచి వేసవి వచ్చే సరికి తాగునీరుకు కూడా కటకటలాడి పోవలసి వుంటుంది.

ఆందోళనలో రైతాంగం

తమిళనాడులో ఈ ఏడాది కురిసిన భారీ వర్షాల కారణంగా ఆ రాష్ట్రంలోని రిజర్వాయర్లన్నీ మిగులు జలాలతో కళకళలాడుతున్నాయి. దీంతో కండలేరు నుంచి చెన్నయ్‌కు తాగునీటి సరఫరాను రాష్ట్ర ప్రభుత్వం నిలిపి వేసింది. కేవలం శ్రీకాళహస్తి, రేణిగుంట, తిరుపతి పట్టణాల ప్రజల దాహార్తిని తీర్చేందుకు మాత్రమే కాలువలో 705 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. దీంతో గంగ నీటిని ఎస్కేప్ ఛానళ్ల ద్వారా మళ్లించకుండా ఎక్కడికక్కడ గేట్లు మూసి అధికారులు పహారా కాస్తున్నారు. దీంతో రబీ చివరిదశలో ఉన్న పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొంది. తిరుపతి జిల్లా లక్ష్మీపురం పంప్ హౌజ్ వద్ద గంగ అధికారులు ఇసుక బస్తాలతో రింగ్ బండ్ వేసి నీరు అవతలి వైపు పోకుండా అడ్డుకున్నారు. లక్ష్మీపురం గేట్లకు అవతలి వైపు తొట్టంబేడు మండలంలోని చిట్టత్తూరు, కంచనపల్లి, బోనుపల్లి, కేవీబీపురం మండలంలోని అంజూరు, పవనవారికండ్రిగ, తిమ్మసముద్రం, సత్యవేడు నియోజకవర్గంలోని పలు మండలాల చెరువులకు సాగునీరందాల్సి ఉంది. అయితే లక్ష్మీపురం వద్దే నీటిని ఆపేయడంతో రైతులు ఇటీవల ఆందోళన చేపట్టారు. లక్ష్మీపురం వద్ద ఇసుక బస్తాలను తీసేసి నీటిని మళ్లించే ప్రయత్నం చేయడంతో పోలీసులు అడ్డుకుని రైతులపై దౌర్జన్యానికి దిగారు. అటుగా వెళ్తున్న తిరుపతి ఎంపీ మద్దిల గురుమూర్తి పోలీసులను వారించి రైతులకు నీటిని విడుదల చేయాలని ఆదేశించినా వారు వినలేదు. దీంతో చేసేది లేక రైతులు వెనుదిరగాల్సి వచ్చింది. ముఖ్యంగా వేసవికాలం సమీపిస్తున్న ప్రతిసారీ ఇలాంటి పరిస్థితులే మాకు ఎదురవుతున్నాయనీ, చెన్నయ్, తిరుపతి నగరాలకు నీరు వదిలే క్రమంలో చెరువులకు కూడా నీటిని మళ్లించేందుకు వీలుగా గంగ అధికారులు చర్యలు చేపడితే బాగుటుందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

రైతాంగానికి కూడా ప్రాధాన్యత ఇవ్వాలి

- గంగయ్య, రైతు, బోనుపల్లి



తెలుగు గంగ నీటిని నమ్ముకునే రెండు సార్లు పంటలు పండిస్తున్నాం. అయితే పంట చివరి దశలో నీటి ఎద్దడి ఏర్పడుతోంది. చెరువుల్లో నీరు అడుగంటి పోతోంది. గంగనీటిని మళ్లించేందుకు అధికారులు ఆక్షేపిస్తున్నారు. ఒకవైపు ఎండిపోతున్న పంట.. ఇంకో వైపు కాలువలో నీళ్లున్నా పారగట్టుకోలేని పరిస్థితి. ఇకనైనా అధికారులు చెరువులకు సాగునీరందించేలా ముందస్తు చర్యలు చేపట్టాలి.

బృందావన్ స్కూలుకు గోల్డ్ మెడల్



గోల్డ్ మెడల్ సాధించిన బృందావన్ స్కూలు విద్యార్థులు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ : స్థానిక సంతపేట నందుగల బృందావన్ పాఠశాల విద్యార్థిని విద్యార్థులు కాంచీ పురం జిల్లా తమిళనాడులో నిర్వహించిన నేషనల్ ఫిస్ట్ బాల్ కాంపిటీషన్ లో తమ పాఠశాల విద్యార్థి నులు గోల్డ్ మెడల్ సాధిం చారని పాఠశాల కరస్పాండెంట్ శైలజ కుమారి తెలిపారు. గెలుపొందిన విద్యార్థి నులకు అతిథులు రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ కస్టమస్ ఎం అలంగేసన్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కె రాజపాండ్యన్, ముఖ్య అతిథులు గోల్డ్ మెడల్ అందించారు. బెస్ట్ ప్లేయర్ గా ఎంపికైన బివి హాసిని మను ను మెడల్ తో సత్కరించారని ఆ పాఠశాల కరస్పాండెంట్ శైలజ కుమారి తెలిపారు. ఇలాంటి విజయాలను సాధించాలని అభినందించారు. విద్యార్థులను అభినందించారు చదువుతోపాటు ఆటలు కూడా చాలా ముఖ్యమని తెలిపారు.



వైసిపి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - ఐరాల: ఎన్నికలలో ఇచ్చిన హామీలన్నింటినీ సీఎం జగన్ నెరవేర్చి మాటమీద నిలబడిన వ్యక్తిగా పేరొందారని ఎంఎల్ఏ అభ్యర్థి సునీల్ కుమార్ అన్నారు. ఆదివారం ఐరాలలోని ఓ కల్యాణ మండపంలో జరిగిన పూతలపట్టు నియోజకవర్గ స్థాయి వైయస్ఆర్ యువజన విభాగం ఆత్మీయ సమావేశంలో బియంఆర్ సంస్థ అధినేత మోహన్ రెడ్డి, జిల్లా యూత్ అధ్యక్షులు హేమంత్ రెడ్డి పాల్గొన్నారు.యువజన నాయకులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సమావేశంలో ఎమ్మెల్యే అభ్యర్థి సునీల్ కుమార్ మాట్లాడుతూ చంద్రబాబు గత 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో ఏ ఒక్కటీ నెరవేర్చక మాట తప్పిన నాయకుడిగా పేరొందారన్నారు. ఇంటికో ఉద్యోగం ఇస్తామని,నిరుద్యోగ భృతి ఇస్తామని చంద్రబాబు చెప్పి యువతను మోసం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. తమను గెలిపిస్తే అభివృద్ధి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షులు కె.మహేంద్ర, జిల్లా కార్యదర్శులు కార్తిక్ రెడ్డి,సతీష్,ప్రశాంత్, నియోజకవర్గ యూత్ అధ్యక్షులు సాయి రెడ్డి, మండల అధ్యక్షులు నవీన్ కుమార్, భార్గవ రెడ్డి, జగదీష్, యువ నాయకులు,ఐటీ విభాగం నాయకులు, సోషల్ మీడియా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా మట్టల ఆదివారం పండుగ

ప్రజాశక్తి-గూడూరు టౌన్: ఏసుప్రభు రాకను ఆనందంగా జరుపుకునే మట్టల ఆదివారం సందర్భంగా గూడూరు పట్టణంలో క్రిస్టియన్లు ఏసు ప్రభు గీతాలను ఆలపిస్తూ ప్రదర్శన నిర్వహించారు. పట్టణంలోని ఎస్.ఎ.ఎల్.సి చర్చి నుండి మట్టల ఆదివారం సందర్భంగా క్రిస్టియన్లు ఏసుప్రభు గీతాలు ఆలపిస్తూ పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు.

మోహినీ అవతారంలో అలఘునాథుడు

ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణంలోని శ్రీ అళఘునాథ స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతు న్నాయి. మోహిని అవతారంలో స్వామివారు దర్శనమిచ్చారు. మాడ వీధి ఉత్సవం నిర్వహించారు. లక్ష్మీ జయంతి సంద ర్భంగా మహిళల చే సామూహిక కుంకుమ పూజ వైభవంగా జరిగాయి. భక్తులు పూజా కార్యక్రమాల్లో పాల్గొని తీర్థప్ర సాదాలు స్వీకరించారు. ఉభయకర్తలుగా బట్ట శ్రీనివాసులు ధర్మపత్ని కృష్ణమ్మ కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

'వేమిరెడ్డి దంపతులపై ఆరోపణలు తగదు'

ప్రజాశక్తి-కోట: మాజీ రాజ్యసభ సభ్యు లు, ప్రముఖ పారిశ్రామికవేత్త వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి దంపతులపై కోవూరు ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి వ్యక్తిగతంగా రాజకీయ ఆరోపణలు చేయడం మంచిది కాదని మాజీ ఉమ్మడి నెల్లూరు జిల్లా సెంట్రల్ బ్యాంకు ఉపాధ్యక్షులు నల్లపురెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఆదివారం కోట మండలంలోని కోటమ్మతల్లి ఆలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రసన్నకుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు.

ఘనంగా ఎంపీటీసీ యోగానందరెడ్డి జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-తిరుపతి సిటీ:

తిరుపతి రూరల్ మండలం బ్రాహ్మణపట్టు పంచాయతీ ఎంపిటిసి యోగానంద రెడ్డి జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. తిరుచానూరు సర్పంచి రామ చంద్రారెడ్డి యోగానందరెడ్డికి శుభాకాంక్షలు తెలియజేశారు. కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా పలువురు యోగానందరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

చలి వేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-గూడూరుటౌన్: వేసవికాలంలో చలివేంద్రాలు ప్రజలకు దాహార్తి తీర్చే కేంద్రాలుగా ఉపయోగపడతాయని డాక్టర్ రోహిణి పేర్కొన్నారు. ఆదివారం గూడూరు పట్టణంలోని ఐ.సి.ఎస్ రోడ్డులోని కూరగాయల మార్కెట్ పక్కన ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో కొండూరు సుబ్రమణ్యం జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యుల సహకారంతో చలి వేంద్రన్ని ఏర్పాటు చేశారు. డాక్టరు రోహిణి మాట్లాడుతూ ప్రగతి సేవా సంస్థ ముందుకు వచ్చి చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు కడి వేటి చంద్రశేఖర్, సెక్రటరీ చంద్రశేఖర్, ట్రెజరర్ శ్రీనివాసులు, విజయ్, హరిబాబు, రవీంద్రరెడ్డి పాల్గొన్నారు.

భూ హక్కు చట్టం అత్యంత ప్రమాదకరం

టిడిపి జిల్లా అధ్యక్షులు టిసి రాజన్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: అధికార జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూహక్కు చట్టం అత్యంత ప్రమాదకరమని టిడిపి జిల్లా అధ్యక్షులు టిసి రాజన్ అన్నారు. ఆదివారం స్థానిక టిడిపి జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం పూర్తిగా అవినీతిమ యమైందన్నారు. అధికార పార్టీ భూదాహానికి కడప జిల్లా ఒంటిమిట్టకు చెందిన పాల సుబ్బారావు కుటుంబం బలి కావడమే నిదర్శనం అన్నారు. మైనింగ్, ఇసుక మాఫియా తో పాటు అక్రమ మార్గంలో గంజాయి రవాణా చేస్తూ కోట్లు గడిస్తున్న వైసిపి పెద్దలు రాష్ట్రంలోని భూ దోపిడీకి పాల్పడేందుకే ఈ చట్టాన్ని తీసుకొచ్చారని తెలిపారు. జీవో నెంబర్3ని రద్దు చేసే వరకు టిడిపి పార్టీ పోరాటం కొనసాగిస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపి అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు దొరబాబు, సురేంద్ర కుమార్, కోదండ యాదవ్, చిట్టిబాబు, మోహన్ రాజ్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలు పెంపునకు కృషి

చిత్తూరు పార్లమెంట్ టిడిపి అభ్యర్థి దగ్గు మళ్ళ ప్రసాదరావు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా తన వంతు కృషి చేస్తానని చిత్తూరు పార్లమెంట్ టిడిపి ఉమ్మడి అభ్యర్థి దగ్గు మళ్ళ ప్రసాదరావు తెలిపారు. ఆదివారం బెంగళూరులోని ఆంధ్రప్రదేశ్ ఐటి ఉద్యోగుల ఆత్మీయ సమావేశంలో మాజీ మంత్రి పలమనేరు టిడిపి అభ్యర్థి అమర్నాథ్ రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిత్తూరు ఎంపీ అభ్యర్థి మాట్లాడుతూ ఐటీ రంగానికి గుర్తింపు తెచ్చింది చంద్రబాబు నాయుడే నని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా అప్పటి రాజధాని హైదరాబాద్ ను ఐటి పరంగా పలు రకాలుగా అభివృద్ధి చేసి అనేక కంపెనీలను తీసుకొచ్చి సామాన్య మధ్యతరగతి చెందిన వేలాది మందికి ఐటి పరంగా ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఘనత చంద్రబాబుకే దక్కిందన్నారు. ఆయన చొరవతో రాష్ట్ర వ్యాప్తంగా అనేక ఐటీ రంగా సంస్థలు ఏర్పాటుతో పాటు అనంతపురంలో కియా వంటి సంస్థలు వచ్చి వేలాది మందికి ఉపాధి అవకాశాల్లో దక్కాయన్నారు. గత ఐదేళ్లగా రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల కారణంగా పలు కంపెనీలు రాష్ట్రానికి రావడానికి మక్కువ చూప లేకపోతున్నాయి. తద్వారా వేలాది మంది నిరుద్యోగులు చెన్నై బెంగళూరు వంటి ప్రాంతాలకు ఉద్యోగ అవకాశాల కోసం వెళ్లాల్సిన దుస్థితి నెలకొందన్నారు. ప్రస్తుత ప్రభుత్వ విధానాల వల్ల చిత్తూరు జిల్లాలోని అమర్ రాజా వంటి బహుళ జాతి సంస్థ మూతవడంతో అనేకమంది నిరుద్యోగులు వీధిన పడ్డారన్నారు. వైసిపి ప్రభుత్వం విధానాల వల్ల రాష్ట్రంలో పలు పారిశ్రామిక సంస్థలు మనగడ ప్రశ్నార్థకంగా మారిందని, దీంతో ఇంజనీరింగ్ తదితర ఉన్నత విద్య అభ్యసించిన నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు దక్కడం గగనమైందన్నారు. ఈ కారణంగా వేలాదిమంది యువత ఉద్యోగ అవకాశాల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారన్నారు. చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే ఐటి రంగానికి పూర్వం వైభవం దక్కుతుందని పేర్కొన్నారు. తాను చంద్రబాబు స్ఫూర్తితోనే ఉన్నత ఉద్యోగానికి రాజీనామా చేసి ప్రజాసేవ చేయడానికి రాజకీయాల్లోకి వచ్చానని చెప్పారు. చిత్తూరు పార్లమెంట్ సెగ్మెంట్ ను అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలిపి నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి కృషి చేస్తానన్నారు.


చిత్తూరు పార్లమెంటరీ అభ్యర్థి ప్రసాదరావు, అమరనాథరెడ్డిని సన్మానిస్తున్న ఐటి ఉద్యోగులు

వైసిపి భూ దందాలకు ముగ్గురు బలి: గురజాల జగన్మోహన్

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: వైసిపి నేతల భూ దందాతోనే ముగ్గురు ఆత్మ హత్యకు పాల్పడ్డారని, ఇది ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నిరంకుశ పాలనకు నిదర్శనమని చితూరు నియోజకవర్గ టిడిపి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ అన్నారు. ఆదివారం సాయంత్రం తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒకపక్క రాష్ట్రంలో వైసిపి మంత్రులు నేతలు భూదందా మైనింగ్ మాఫియా, ఎర్రచందన అక్రమ రవాణాకు పాల్పడుతుంటే మరోపక్క డ్రగ్స్ మాఫియాకు కేంద్ర బిందువుగా రాష్ట్ర ప్రభుత్వం ఉదాహరణగా చెప్పవచ్చున్నారు. ఉచిత పథకాల పేరుతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ఆయన విమర్శించారు. కేంద్ర హోం శాఖ సైతం విడుదల చేసిన డ్రగ్స్ సరఫరా వ్యవహారంలో ఏపీ నంబర్1గా ఉందని ప్రకటించిందని దీన్ని పరిశీలిస్తే ఆంధ్రప్రదేశ్‌లో మాదకద్రవ్యాలు సరఫరా ఏ విధంగా సరఫరాతో ఉందో అర్థం చేసుకోవచ్చున్నారు. ఇటీవల విశాఖపట్నంలో వేల కోట్ల విలువగల డ్రగ్స్‌ను పట్టుకోవడమే ఉదాహరణగా చెప్పవచ్చునన్నారు. సాక్షాత్తు జగన్ మోహన్ రెడ్డి సొంత నియోజకవర్గం లోని వైసిపి నాయకులు చేపట్టిన భూదందా కారణంగా పేద కుటుంబానికి చెందిన బాలసుబ్రమణ్యం, పద్మావతి వినయ దంపతులు ఆత్మహత్యకు చేసుకున్నారని దీన్ని చూస్తుంటే జగన్మోహన్ రెడ్డి పాలన ఏ విధంగా సాగిందో అర్థమైందన్నారు. కొన్ని సవరణలు చేసి కోట్లాది రూపాయలు విలువచేసే భూములను కాజేసిన ఘనత జగన్మోహన్ రెడ్డి పాలనకే సాధ్యమైందన్నారు. విశాఖపట్నంలో డ్రగ్స్ ను తీసుకొచ్చి యువత భవిష్యత్తును సర్వనాశనం చేశార న్నారు. వైసిపి నాయకులు ప్రజల ఆస్తులను దోచుకోవడం బాధాకరమని వాపోయారు. వైసీపీ నాయకులు చేపట్టిన భూ దందాలు, ఇసుక , మైనింగ్ అక్రమాలు , దౌర్జన్యాలను బయట పెడతామని స్పష్టం చేశారు.


మాట్లాడుతున్న గురజాల జగన్మోహన్

వైసిపిలో పలువురి చేరిక

ప్రజాశక్తి - చిత్తూరు డెస్క్: నగరి మండలంలోని టీఆర్ కండ్రిగకు చెందిన మాజీ కౌన్సిలర్ వెంకటేశ్, సాయి, వినోద్, అనంతప్ప నాయుడు కండ్రిగకు చెందిన హరి, గోవిందస్వామి, సురేష్, చంద్ర, బుగ్గకండ్రిగకు చెందిన శివ, దుర్గాప్రసాద్, రవి, మేఘనాథం, మణి, భాస్కర్, జగన్నాథం సమక్షంలో సుమారు 400 మంది వైసిపిలో చేరారు. మంత్రి నివాస కార్యాలయం వద్దకు విచ్చేసిన వీరిని మంత్రి ఆర్కేరోజా పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన నేతలు మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో గ్రామంలో ఏర్పడిన అంతర్గత వ్యవహారాల వల్ల పార్టీని వదలిపెట్టినా తటస్థంగా ఉంటూ వచ్చామన్నారు. ప్రస్తుతం మా వార్డులో అభివృద్ధి పనులు బాగా జరుగుతోందని ముఖ్యంగా తమ వార్డుకు దేశమ్మ ఆలయాన్ని మంత్రి రూ.3 కోట్లు వెచ్చించి పునర్మించి అన్ని వసతులు కల్పించి ఆలయ ప్రతిష్టను అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలకు అతీతంగా సంక్షే మం అందు తోందన్నా రు. ఇవి తమ అందరినీ కదిలిం చిందని అభివృద్ధి వైపు తిప్పిందన్నారు. మంత్రి మాట్లాడుతూ అభివృద్ధి చేసే వారిని ప్రోత్సహిస్తే మరింత అభివృద్ధి జరుగుతుందని గ్రహించి పార్టీలో చేరిన వారిని అభినందిస్తున్నానన్నారు.



మంత్రి రోజా సమక్షంలో వైసిపిలో చేరిన కార్యకర్తలు

పార్టీ గెలుపుకోసం, జగనన్నను ముఖ్యమంత్రిని చేయడం కోసం అందరం కలిసి పోరాడు దామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ పీజీ నీలమేఘం, దేశమ్మ దేవాలయ ఛైర్మన్ వేణుబాబు, వైసిపి నాయకులు బీడీ భాస్కర్, శశికుమార్, ఇంద్రయ్య పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - వెదురుకుప్పం: మండలం లోని ఉడమలకుర్తి, పొదలపల్లి ,చిలమాకులపల్లి వెంకటాపురం ,పిళ్ళారి కుప్పం,జిఎంఆర్ పురం గ్రామ పంచాయతీలలో పరిధిలోని గ్రామాలలో డిప్యూటీ సీఎం నారాయణస్వామి, గంగాధర నెల్లూరు నియోజకవర్గ వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కృపా లక్ష్మి గ్రామాలలో ఆదివారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఉడమల కుర్తి గ్రామంలో స్థానిక సర్పంచ్ చిట్టి మహేష్ డిప్యూటీ నారాయణస్వామి కృపా లక్ష్మి గజమాలవేసి సన్మానించి పూలు జల్లుతో ఆహ్వానించి ఇంటింటికి తీసుకెళ్లి కరపత్రాలు పెంచుతూ మేనిఫెస్టోల్ని మహిళలకి గ్రామస్తులకి వివరించారు. ఈ సందర్భంగా ఆయన నియోజకవర్గంలో అభివృద్ధిని చూసి ఓటు వేయాలని తమ కూతురు కృపా లక్ష్మిని గెలిపించి ఆదరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ప్రసాద్ రెడ్డి జనార్ధన్ గురవారెడ్డి మనీ సురేష్ వర్మ రెడ్డి శివయ్య డిఎస్ రాజు వెంకటరత్నం నాగరత్నం కామేష్ కాలప్ప గోవిందయ్య రమేష్ ఏకంబరం చిరంజీవి రిషి సోమశేఖర్ రామచంద్రయ్య బాలాజీ చెంచులయ్య నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు



క్రైం న్యూస్

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి


రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ధనపాల్

ప్రజాశక్తి - చిత్తూరు డెస్క్: మున్సిపల్ పరిధి కొండచుట్టు మండపం సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వి.ధనపాల్ (58) మృతి చెందాడు. సీఐ సురేష్ కథనం మేరకు నింద్ర మండలం కొత్త ఆరూరుకు చెందిన ధనపాల్ పుత్తూరు వైపు నుంచి నగరికి ద్విచక్రవాహనంలో వస్తుండగా తిరుపతి వైపు వేగంగా వెళుతున్న ప్రైవేటు బస్సు ఢీ కొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. తీవ్రగాయాలపాలైన ధనపాల్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోస్టు మార్టం నిమిత్తం మృతదేహాన్ని నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. బస్సును పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

టిడిపి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి- పూతలపట్టు: రానున్న ఎన్నికల్లో మీకు అండగా ఉంటానని అభ్యర్థి డాక్టర్ మురళీమోహన్ పేర్కొన్నారు. మండలంలోని ఎరచెరువు పల్లి పంచాయతీలో ఆదివారం ప్రచారం నిర్వహించారు. టిడిపి మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ప్రజ లు ఆయనకు ఘన స్వాగతం పలికి హారతులు ఇచ్చారు. ఆయన వెంట నాయ కులు మురళీమోహన్ నాయుడు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

కేంద్ర బలగాలతో కవాతు

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: ఎన్నికల్లో ఓటర్లు స్వేచ్ఛగా ఓటింగ్‌లో పాల్గొనడానికి వారిలో ఆత్మస్థైర్యం నింపడానికి కేంద్ర బలగాలు మండల కేంద్రం గంగాధర నెల్లూరు లో ఆదివారం కవాతు నిర్వహించారు. సీఐ శంకర్ మాట్లాడుతూ ఎన్నికలు స్వేచ్ఛగా నిర్వహించడానికి ఎలక్షన్ కమిషన్ పక్కా ఏర్పాటు చేపట్టిందని ఈ మేరకు జిల్లాకు కేంద్ర ప్రభుత్వం నుండి బలగాలు వచ్చాయని రాష్ట్ర పోలీసు యంత్రాంగంతో పాటు కేంద్ర బలగాలు ఈ ఎన్నికల విధుల్లో భద్రత కార్యక్రమాల్లో పాల్గొంటాయన్నారు. స్వేచ్ఛ వాతావరణం లో ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు హక్కును వినియోగించు కోవడం కోసం వారిలో స్థైర్యం నిర్వహించడానికి ఇలాంటి కవాతులు జిల్లా వ్యాప్తంగా కేంద్ర బలగాలు నిర్వహిస్తున్నాయన్నారు.

రామకుప్పం: చిత్తూరు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కుప్పం సబ్ డివిజన్ డీఎస్పీ శ్రీనాథ్ పర్యవేక్షణలో ఆదివారం రామకుప్పం మండల లో ప్రత్యేక పోలీసు బలగాల కవాతు నిర్వహించారు. రామకుప్పం ఎస్ఐ శివకుమార్, పోలీసు సిబ్బంది, సియర్పిఎఫ్ సిబ్బంది సుమారు 80 మంది తో కలిసి మండలం లో క్రిటికల్ విలేజెస్ మిట్టపల్లి, రాజుపేట , చల్దిగానిపల్లి ప్రాంతాలలో కవాతు చేపట్టారు. రాబోయే అసెంబ్లీ మరియు పార్లమెంటరీ ఎన్నికల గురించి కవాతు నిర్వహిస్తూ.. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు... ప్రతి ఓటరుకు మేము ఉన్నాం ...అని భరోసాను కల్పిస్తూ అదేవిధంగా ఎన్నికల ప్రక్రియకు ఏమైనా ఆటంకం కలిగిస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైసిపి బైక్ ర్యాలీ

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: వైసిపి విజయానికి యువత కీలకంగా పనిచేయాలని జిల్లా వైసిపి యువత ఉపాధ్యక్షులు మహేంద్ర పేర్కొన్నారు. ఆదివారం ఐరాల మండలంలో జరిగిన యువత ఆత్మీయ సమ్మేళనానికి బంగారుపాలెం నుండి యువత బైక్ ర్యాలీ చేపట్టి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాసనసభ, లోక్ సభ ఎన్నికల్లో యువత అధికంగా పాల్గొని పార్టీ విజయానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల యువత అధ్యక్షులు జగదీష్ సాయి, సతీష్, పలువురు యువత పాల్గొన్నారు.


బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న వైసిపి నాయకులు

ఘనంగా కందూరు గంగ జాతర చాటింపు

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు గ్రామంలో ఆదివారం గంగ జాతర నిర్వహణ కోసం గ్రామ చావిడి వద్ద ఘనంగా చాటింపు నిర్వహించారు. గ్రామ పెద్దలు, గ్రామస్తులు చాటింపు కార్యక్రమంలో పాల్గొని జాతర చాటింపును ప్రకటించారు. మార్చి 31వ తేదీ ఆదివారం రాత్రి అమ్మవారి విగ్రహ ప్రతిష్ట, ఏప్రిల్ 1వ తేదీ సోమవారం గంగ జాతర నిర్వహించే విధంగా జాతర చాటింపులో పెద్దలు ప్రకటించారు.


సూరిని సన్మానిస్తున్న గురజాల జగన్మోహన్

గురజాలను సన్మానించిన సూరిరెడ్డి

ప్రజాశక్తి- వెదురు కుప్పం: చిత్తూరు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ నాయుడుని టిడిపి నాయకుడు కొత్తపల్లి చెందిన సూరి రెడ్డి తన మిత్రులతో కలిసి ఆదివారం పీల్లి గుండ్ల పల్లెలో గౌరవ పూర్వకంగా కలిశారు. పిల్లిగుండ్లపల్లి లోని త్యాగరాజు నాయుడు కుమారుడు కిషోర్ కు జగన్మోహన్ నాయుడు మిత్రుడు కావడంతో కిషోర్ కుటుంబంలో జరిగిన ఓ కార్యక్రమానికి ఆదివారం జగన్మోహన్ నాయుడు హాజరయ్యారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి వెళ్లిన సూర్ రెడ్డి జగన్మోహన్ నాయుడు కి శాలువాతో సన్మానించి సన్మానించారు. తిరిగి అతను సూర్యుడిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో సూరి రెడ్డి మిత్రులు , స్థానిక టిడిపి నాయకులు చేకూరి బాలాజీ నాయుడు, జగదీష్, మండల నియోజకవర్గ టిడిపి నాయకులు పాల్గొన్నారు.



టిడిపిలో చేరిన వైసిపి నాయకులు

వైసిపి నుంచి టిడిపిలో చేరిక

ప్రజాశక్తి -వెదురుకుప్పం:

మండలంలోని గంటా వారి పల్లి పంచాయ తీలో బాబు ష్యూరిటీ –భవిష్య త్తు గ్యారంటీ ప్రోగ్రాం లో భాగంగా, మన ఇంటికి మన థామస్ కార్య క్రమాన్ని ఆదివారం తెలుగు తమ్ముళ్లు నిర్వహిం చారు. ఈ కార్యక్రమం మండల పార్టీ అధ్యక్షులు కామసాని లోకనాథ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆ పంచాయతీలోని గ్రామాలలో ప్రతి ఒక గడపకు వెళ్లి చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితే ప్రజలకు అందించే సంక్షేమ కార్యక్రమాలను ఓటర్లకు థామస్ తెలిపారు. స్థానిక సర్పంచ్ శ్రీనాథరెడ్డి, నాయకుడు విష్ణు రెడ్డి ఆధ్వర్యంలో వైసిపి నుంచి భారీగా టిడిపిలో చేరారు. థామస్ వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. పార్టీ గెలుపు కోసం తమ వంతు కృషి చేస్తామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట ఎన్ఆర్ఐ మీడియా కోఆర్డినేటర్ గురుసాల కిషన్, వెదురుకుప్పం క్లస్టర్ ఇంచార్జ్ మోహన్ మురళి, గొడుగుచింత మాజీ సర్పంచ్ భాస్కర్ నాయుడు, నియోజకవర్గ వాణిజ్య విభాగ కార్యదర్శి బోడి రెడ్డి వెంకటరమణ రెడ్డి, పచ్చికాపల్లం క్లస్టర్ ఇంచార్జ్ చంగల్ రాయల్ రెడ్డి, నాయకులు మోహన్ యాదవ్, చిన్ని, వెంకటేశులు పాల్గొన్నారు.

ఘనంగా క్షయ నివారణ దినోత్సవం



గంగాధర నెల్లూరులో

ప్రజాశక్తి -గంగాధర నెల్లూరు: జాతీయ క్షయ నివారణ దినోత్సవం మండలంలోని వైద్య సిబ్బంది ఆదివారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ దుర్గాదేవి ఆధ్వర్యంలో గంగాధర నెల్లూరు పిహెచ్‌సి వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్షయ లక్షణాలు ఉన్న వారికి ప్రభుత్వాసుపత్రిలో ఉచితంగా పరీక్షలు నిర్వహిస్తారని మందులు ఉచితంగా పంపిణీ చేస్తారని, పౌష్టికాహారం కోసం ప్రతి నెల రూ.500 నగదు ప్రభుత్వం ఇస్తున్నట్లు తెలిపారు. క్షయ ఉన్నవారు డాక్టర్లు ఇచ్చే మందులు తప్పని సరిగా వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, సిహెచ్ఓ శ్రీనివాసులు, ధర్మేంద్ర, షీలా, కదిరివన్, ఏఎన్ఎంలు , ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

కార్వేటినగరం : క్షయ రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ హేమశ్రీ అన్నారు. జాతీయ క్షయ నిర్మూల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం కత్తెరపల్లిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ టీబీ ఓడి పోతుంది, దేశం గెలుస్తోంది, టీబీ అంతం మనందరి పంతం అన్న నినాదంతో ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. రెండు వారాలకు పైగా దగ్గు, జ్వరం. రాత్రి పూట చమటలు పట్టడం, బరువు తగ్గడం, ఆకలి లేక పోవడం వంటి లక్షణాలు ఉన్న వారు వెంటనే సమీపంలోని ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యాధికారులను సంప్రదించాలన్నారు. టీబీ నివారణకు ప్రభుత్వం ఉచితంగా మందులు అందిస్తోందని, ఎవ్వరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. ఈ కార్యక్రమంలో. సీహెచ్ఓ రాజేశ్వరి, పీహెచ్ఎన్ గౌరీ, పర్యవేక్షకులు త్యాగు, చంద్రవల్లీ పలువురు వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



కార్వేటినగరంలో

సోమల: మండల కేంద్రమైన సోమల ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ఆదివారం క్షయ వ్యాధి నిర్మూలనపై ర్యాలీ నిర్వహించారు.క్షయ వ్యాధి నివారణ సమాజిక బాధ్యత, మన అందరి పంతం టీబీ అంతం, టీబీ ఓడిపోతుంది దేశం గెలుస్తుంది అంటూ నినాదాలు చేశారు. వైద్యాధికారి ప్రదీప్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ టీబీ ఒక అంటువ్యాధి అని, ముఖ్యంగా పేద ప్రజలకు, అధిక జనాభా, మురికి వాడలలో నివసించే ప్రాంతంలో వున్నవారికి ఈ వ్యాధి ఎక్కువగా వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ఈ వ్యాధి గ్రాస్తులు దగ్గినపుడు లేదా తుమ్మినప్పుడు తుంపరులు గాలిలో సూక్ష్మ క్రీములు కలిగి వ్యాధి ఆరోగ్యవంతులకు వ్యాపిస్తుందని, తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.



సోమలలో

బంగారు పాళ్యెం: టిబి నివారణకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని బంగారుపాళెం వైద్య అధికారి శిరీష అన్నారు. ఆదివారం క్షయ నివారణ దినోత్సవ కార్యక్రమం పరీక్ష కేంద్రం టెక్నీషియన్ భువనేశ్వరి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శిరీష మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు సాయంత్రం సమయంలో జ్వరం రావడానికి గుర్తించి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య కేంద్రంలో గల్ల పరీక్ష చేపట్టుకోవాలని వ్యాధి నిర్ధారణ అయిన తర్వాత తగిన మందులు వాడితే క్షయ వ్యాధి నివారణ అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు అఖిల్ , భార్గవ్, జ్యోతి డిపిఎమ్ఓ మనీ , ఐసిటిఎస్ కౌన్సిలర్ బాబు, పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

